క్లుప్తంగా

వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్

నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. మొత్తం ఎనిమిది ఖాళీలున్నాయన్నారు. చినదొడ్డిగల్లులో -2 (ఎస్సీ మహిళ- 1, ఓసీ మహిళ-1), బోదిగల్లంలో-1 (బీసీ మహిళ), ఉపమాక -1 (ఎస్సీ మహిళ), అమలాపురం -1(జనరల్), పెదతీనార్ల-1(బీసీ), నెల్లిపూడి-1(ఓసీ మహిళ), డొంకాడ-1(ఎస్సీ మహిళ) చొప్పున నియమించినున్నట్టు చెప్పారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 26,27 తేదీల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 28న పరిశీలన,29న మౌఖిక పరీక్ష, 30న ఎంపికైన వలంటీర్ల జాబితా ప్రకటన, 31న నియామక ఉత్తర్వుల జారీ వంటి ప్రక్రియక ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తెలిపారు. సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంను ఆమె శనివారం మునగపాకలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన చోట రక్షిత మంచినీటి ట్యాంక్‌లు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎంపీడీవో రవికుమార్,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేష్, మెలిపాక సర్పంచ్ సురేష్, మండల ఇంజనీరింగ్ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కోటవురట్ల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ స్కాలర్‌షిప్‌కు రాజుపేట ఎంపీయూపీ స్కూల్ నుంచి ఎ.కృష్ణకుమార్, పాములవాక జెడ్పీ హైస్కూల్ నుంచి పి.దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. రాజంపేటలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విజయ హోమం



కల్యాణ వినాయకుడు

రాంబిల్లి: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ పంచదార్ల పుణ్యక్షేత్రంలో గల ద్విముఖ కల్యాణ వినాయకుడి సన్నిధిలో ఆదివారం విజయ హోమం నిర్వహించనున్నారు. ఏటా ఈ విజయ హోమం నిర్వహిస్తామని భగవత్ భక్తి ప్రచార ట్రస్టు ప్రతినిధి శిగిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఈ విజయ హోమంలో పాల్గొనాలని కోరారు.

త్వైకాండో క్రీడాకారులకు కిట్ల పంపిణీ

ఎస్.రాయవరం: జాతీయ స్థాయి త్వైకాండో పోటీలకు ఎంపికైన అడ్డురోడ్డు చందు త్వైకాండో విద్యార్థులకు తిమ్మాపురం గ్రామ పెద్ద కర్రి చంద్రశేఖర్‌రావు బాడీ కిట్లు పంపిణీ చేశారు. ప్రతిఫలం ఆశించకుండా శిక్షణ ఇస్తున్న కోచ్ చందును ఆయన అభినందించారు.

యువతి అదృశ్యం



అనిత(ఫైల్)

కోటవురట్ల: రామన్నపాలెం గ్రామానికి చెందిన గుడివాడ అనిత అనే యువతి అదృశ్యమైనట్టు ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. ఆమె తండ్రి స్వామినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఆ సమయంలో నలుపు రంగు పంజాబీ డ్రెస్ వేసుకుందని, ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

నిధుల స్వాహాపై నిగ్గు తేల్చండి

- బినామీ పేర్లతో జీతాల చెల్లింపులు
- చెత్త డబ్బాల కొనుగోల్‌మాల్‌పై చర్యలేవీ ?
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సభ్యుల ఆగ్రహం
- అక్రమ నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్ల మంజూరుపై రగడ
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మధ్యలో వెళ్లిపోయిన చైర్‌పర్సన్



కౌన్సిల్ సమావేశం నుంచి వెళ్లిపోతున్న చైర్‌పర్సన్ రమాకుమారి



నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైస్ చైర్మన్ గుప్తా

యలమంచిలి: బినామీ పేర్లతో జీతాల రూపంలో లక్షలాది రూపాయలు స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ గుప్తా, 16 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు డిమాండ్ చేశారు. యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో నిధుల దుర్వినియోగంపై సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రెండు నెలల క్రితం చెత్త డబ్బాల కొనుగోలులో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసినా ఇప్పటి వరకు కదలిక లేకపోవడం దారుణమని గుప్తా అన్నారు. దీనికి మిగతా సభ్యులు కూడా గొంతు కలపడంతో గందరగోళం ఏర్పడింది. పట్టణంలో అక్రమంగా నిర్మించిన 157 భవంతులకు ఎన్‌వోసీలు లేకపోయినా విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేయడంపై అంతకుముందు సుదీర్ఘ చర్చ జరిగింది. తనకు తెలియకుండా ఈ విషయంపై అధికారులు కోర్టులో వ్యాజ్యం దాఖలు చేయడంపై చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మండిపడ్డారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా అధికారులు వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు తుది తీర్పునకు లోబడి తీసుకునే చర్యలకు అంగీకరిస్తూ ప్రమాణ పత్రాలు ఇచ్చిన భవన యజమానులకు విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేసేలా తీర్మానం చేయాలని చైర్‌పర్సన్ సూచించారు. మీటింగ్ మినిట్స్‌లో ఈ అంశం చేర్చేందుకు నిబంధనలు అనుమతించవని కమిషనర్ కృష్ణవేణి, మరికొందరు అధికారులు చెప్పడంతో ఆగ్రహానికి గురైన చైర్‌పర్సన్ సమావేశం నుంచి మధ్యలోనే వెళ్లిపోయారు.దీంతో మల్లగుల్లాలు పడిన అధికారులు మినిట్స్‌లో ఈ విషయాన్ని పొందుపరచడానికి నిర్ణయించుకున్నారు. సాయంత్రం 4.30గంటలకు మళ్లీ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన ఏడు అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. మరో మున్సిపల్ వైస్‌చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, కౌన్సిలర్లు దూది నర్సింహమూర్తి,పిట్టా సత్తిబాబు,గొర్లె వెంకట్,మరిణేశ్వరావు,పందూరి హరనాథ్, వివిధ విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాల్సిందే

ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న లక్షలాది రూపాయలు స్వాహా కావడం శోచనీయమని వైస్ చైర్మన్‌గుప్తా అన్నారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బినామీ పేర్లతో రూ 5.25లక్షలు జీతాలు చెల్లించినట్టు ఆధారాలున్నాయన్నారు. అదేవిధంగా చెత్త డబ్బాల కొనుగోళ్లలో పెద్దమొత్తంలో నిధులు పక్కదారి పట్టాయి, దీనిపై తక్షణమే విచారణ జరిపి బాధ్యుల నుంచి సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం రాతపూర్వకంగా 16మంది సభ్యుల సంతకాలతో ఫిర్యాదు చేశాం.

నేవీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి



నేవీ నిర్వాసితుల నాయకులతో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: నేవీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు తెలిపారు. నేవీ నిర్వాసితుల ఐక్య వేదిక నాయకులు శనివారం విశాఖపట్నంలో ఎమ్మెల్యేను కలిశారు. తమ డిమాండ్లు పరిష్కరిస్తే ధర్నా విరమిస్తామని నాయకులు పేర్కొన్నారు. నేవీ నిర్వాసితులు, మత్స్యకారులకు సంబంధించిన అంశంపై అసెంబ్లీలో కూడా చర్చించానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమార వర్మ పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు



సచివాలయాల కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న మండల కన్వీనర్ గణేష్

మునగపాక: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర పూర్ణచంద్రరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహసారథులు తమకు కేటాయించిన పరిధిలో ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. ఇంతవరకు ప్రభుత్వం ద్వారా అందిన సాయం వివరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయలక్ష్మి,జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ,ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,ఇల్లా శిరీషా,కిరణ్‌కుమార్,దళిత విభాగం మండల కన్వీనర్ మందా రాము,సచివాలయ కన్వీనర్లు నరాలశెట్టి సూర్యనారాయణ,చదరం అప్పలనాయుడు,గుంట్ల అప్పారావు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు,మహిళా విభాగం మండల నేత శీరా రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలు



జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: స్థానిక సంపద తయారీ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సర్పంచ్ దిమ్మల అప్పారావు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ సంపదతయారీ కేంద్రాలను అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. శిక్షణకు హాజరైన వారితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాము

అచ్యుతాపురం(అనకాపల్లి): కార్మిక, రైతు, ఉపాధి, కూలీల సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము కోరారు. అచ్యుతాపురం మండలంలోని పెదపాడు, తిమ్మరాజుపేటల్లో శనివారం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను పాల్పడుతోందని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు.

130 ఎకరాల్లో నువ్వు పంటకు నష్టం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అకాల వర్షాల కారణంగా మండలంలో 130 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. మూడు రోజుల పాటు కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి బి. శంకర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది శనివారం పరిశీలించారు. జగ్గన్నపేట, ఖాజీపాలెం,హరిపాలెం,తిమ్మరాజుపేట గ్రామాల పరిధిలోని పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె.బి. సూర్యనారాయణ,సర్పంచ్ దొడ్డి కృష్ణ వెంకట లక్ష్మి, మళ్ల ఆదీశ్వరరావు,మళ్ల భాస్కర్‌రావు, దొడ్డి దుర్గునాయుడు, పీలా కోదండ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



కోటవురట్ల: పాములవాకలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



మునగపాక: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి జానకీరామ్



ఎస్.రాయవరం: కొత్తరేవుపోలవరంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

కోటవురట్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, అందుకే వారి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ ఆసరా నిధులు జమ అయిన సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి డ్వాక్రా సభ్యులు శనివారం క్షీరాభిషేకం చేసి, జైజగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ చాలా పథకాలను నేరుగా మహిళలకే అందజేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎస్.రాయవరం: వైఎస్సార్ ఆసరాను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శివప్రసాద్ అన్నారు. కొరుప్రోలు,గుడివాడ, తిమ్మాపురం కొత్తరేవుపోలవరం,పెదఉప్పలం తదితర గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలతో శనివారం సమావేశాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి 3 వ విడత విడుదల చేసిన నగదు వివరాలను సభ్యులకు వివరించారు. ఈ నగదు 10 రోజుల్లో ఆయా గ్రూపులు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, చోడిపల్లి అనూరాధ,మల్లే లోవరాజు,కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ కొత్తరేవు పోలవరంలో సీఎం చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: వైఎస్సార్ ఆసరాతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారం జానకీరామ్ కోరారు. మండలంలోని ఒంపోలుపేటలో శనివారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై తీవ్ర నిర్లక్ష్యం

ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం వెల్లడి



సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

పాయకరావుపేట: జాతీయ ఉపాధి హామీ పథకంలో పలు గ్రామాల్లో మొక్కల పెంపకం సక్రమంగా చేపట్టలేదని సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో అధికారుల దృష్టికి తీసుకొచ్చింది. సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం మండల పరిషత్ ఆవరణలో జరిగింది. సామాజిక తనిఖీ బృందం మండలంలోని ఈ నెల 14 నుంచి 24 వరకు తనిఖీలు నిర్వహించి, రూపొందించి రిపోర్టులో అంశాలను ప్రజావేదికలో వెల్లడించారు. మొక్కల పెంపకం పై ఉపాధి హామీ పథకం సిబ్బంది శ్రద్ధ తీసుకోలేదని ఫిర్యాదు చేశారు. నాటిన మొక్కల సంరక్షణ కోసం ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించవలసిన బాధ్యత సిబ్బందిపై ఉన్నప్పటికీ బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని ప్రజా వేదికలో తనిఖీ బృందం వెల్లడించింది. ప్రజావేదికకు హాజరైన డ్వామా అడిషనల్ పీడీ ఎం.రోజారాణి మాట్లాడుతూ మొక్కల సంరక్షణ పై శ్రద్ధ తీసుకోవలసిన బాధ్యత సిబ్బంది పై ఉందన్నారు. అనంతరం 2021-22 సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల పై గ్రామాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడచిన సంవత్సరంలో 232 ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, పంచాయతీ రాజ్‌కు సంబంధించి 45 పనులు, ఎస్ఎస్ఏకు సంబంధించి 8 పనులు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. అనంతరం గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికకు వివరించింది. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎ.నిర్మల, యలమంచిలి క్లస్టర్ ఏపీడీ టి.వి. శ్రీనివాస్‌కుమార్, సోషల్ ఆడిట్ ప్రతినిధి ఎం.నాగరాజు, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఏపీవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే మేలు



నువ్వు సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

రాంబిల్లి: వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించి సాగు చేస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ రవిప్రకాష్ అన్నారు. గోకివాడ గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. నువ్వు సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నువ్వు పంట లాభదాయకంగా ఉంటుందని ఏడీఏ తెలిపారు. సరైన యాజమాన్య పద్ధతులు ద్వారా నువ్వు పంటను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో సి.సుమంత అన్నారు. నువ్వు సాగు అనంతరం చిరుధాన్యాలను సాగు చేయాలని ఆమె సూచించారు.

సమగ్ర సర్వేతో భూ వివాదాలకు చెక్

- అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా నిర్వహిస్తున్న సమగ్ర భూ రీ సర్వేతో భూ వివాదాలకు చెక్ పడుతుందని అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ అన్నారు. సర్వేపూర్తయితే కచ్చితమైన కొలతలతో భూ వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని సబ్బవరం, అనకపల్లి గ్రామాల్లో రెవెన్యూ బృందాలు నిర్వహిస్తున్న సమగ్ర రీ సర్వేను శనివారం ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణ మాట్లాడుతూ అనేక సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ రీ సర్వే వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వేలో కచ్చితమైన కొలతలు రికార్డుల్లో నమోదవుతాయని చెప్పారు. రైతులంతా అధికారులకు సహకరిస్తూ తమ కమతాలను దగ్గరుండి చూపించి సర్వే చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకూ పలు గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి కంప్యూటర్‌లో పొందుపరిచిన రీ సర్వే వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్,మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు,ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు శేషు,నూకరత్నం పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక: మండలంలోని ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మడకపాలెం(బీసీ-డీ),గణపర్తి(ఎస్సీ),పాటిపల్లి(బీసీ-డీ మహిళ), మునగపాక-2(మూలపేట క్లస్టర్- ఎస్సీ మహిళ),టి.సిరసపల్లి(బీసీ-డీ)కి కేటాయించినట్టు పేర్కొన్నారు.ఈ నెల 27వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 28న పరిశీలన, 29వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.ఎంపికైన వారికి 31న పోస్టింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

జగనన్న లేఅవుట్లలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు సూచించారు. పలు మండలాల్లో శనివారం హౌసింగ్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారు.



కోటవురట్ల : కొడవటిపూడి లే అవుట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు



నక్కపల్లి: ఉపమాకలో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో



మునగపాక: లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మంజులావాణి

మునగపాక: జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని మండల ప్రత్యేకాధికారి మంజులావాణి ఆదేశించారు. హౌసింగ్‌డే లో భాగంగా శనివారం మండలంలోని వెంకటాపురం,సిరసపల్లి జగనన్న కాలనీలను సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 7న సామూహిక గృహ ప్రవేశాలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి,ఎంపీడీవో రవికుమార్,పంచాయతీ కార్యదర్శులు మోహిని,దుర్గ, విద్యుత్‌శాఖ ఏఈ గోపీ,ఉపాధిహామీ పథకం ఏపీవో ఎరకయ్య,హౌసింగ్ ఏఈ భవ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు. ఉపమాకలో జగనన్న లేఅవుట్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతి వారం తనిఖీలు ఉంటాయన్నారు. స్థలాలు పొందిన వారు కచ్చితంగా ఇళ్లు నిర్మించాలని చెప్పారు. లేకపోతే పట్టా రద్దు చేసి, ఆ స్థలాన్ని వేరొకరికి ఇవ్వడం జరుగుతుందన్నారు.

కోటవురట్ల: ఇళ్ల నిర్మాణాల విషయంలో సమస్యలు ఉంటే చెప్పాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ కోరారు. కొడవటిపూడి గ్రామంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఈవోపీఆర్డీ ప్రేమ్ సాగర్, ఏపీఎం రమణకుమారి, సర్పంచ్ కోసూరు అప్పారావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో

ఎస్.రాయవరం: జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన వారు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ ఏఈ ప్రసాద్ తెలిపారు.

సర్వసిద్ధి గ్రామంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. మండల అధికారులు జగనన్న కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు దుర్గాశంకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రోజూ స్పందన

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి మంజులావాణి సూచించారు.మండలంలోని టి.సిరసపల్లి సచివాలయాన్ని ఆమె శనివారం సందర్శించారు. సచివాలయ ఉద్యోగుల హాజరుతో పాటు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ సచివాలయంలో స్పందన నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి దుర్గ ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాంబిల్లి: స్థానిక శ్రీ విద్య నికేతన్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు రాధాస్వామి సత్సంగ్ ప్రతినిధులు రాజగోపాల్‌రాజు, సంతు తెలిపారు. ఎముకలు, చర్మం, గైనిక్, నేత్ర వైద్యులు, చంటి పిల్లల వైద్య నిపుణులు సేవలందించనున్నారు. హోమియో, ఆయుర్వేదిక్ వైద్య నిపుణులు వైద్య సేవలందించనున్నారని తెలిపారు.